క్లుప్తంగా

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గానికి నియామక పత్రాలు అందిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం ఆర్యవైశ్యసంఘం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా యిన్నమూరి వెంకట శ్రీనివాసరావు(తెనాలి శ్రీను), రాజా బాలమస్తానయ్య, కోశాధికారిగా చల్లగండ్ల నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. నూతన కమిటీకి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వోలేటి వెంకటరాధాకృష్ణ శనివారం నియామక పత్రాలను అందించారు.

డీఎన్నార్ విద్యార్థులకు 'లా' పట్టాల అందజేత



భీమవరం డీఎన్నార్ లా కళాశాల విద్యార్థులకు పట్టాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం డీఎన్నార్ లా కళాశాలలో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శనివారం లా సర్టిఫికెట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగ రాజు మాట్లాడుతూ గడిచిన విద్యా సంవత్సరంలో 85 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా వారిలో 143 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారన్నారు. విద్యార్థుల ఉన్నతికి, కళాశాల అభివృద్ధికి యాజమాన్యం కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఎంవీ కృష్ణంరాజు, కళాశాల ప్రిన్సిపల్ కె.రఘురామ్, చెల్లబోయిన రంగారావు, వై.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు బియ్యం పంపిణీ

భీమవరం: భారీ వర్షాలు, వరదముంపునకు గురై ఇబ్బంది పడుతున్న భీమవరం పట్టణంలోని దుర్గాపురం ప్రాంతానికి చెందిన బాధితులకు శ్రీ విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో దాతల సహకారంతో శనివారం బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గంటా శివప్రసాద్ మాట్లాడుతూ దుర్గాపురం ప్రాంతం పట్టణానికి శివారున ఉండడంతో యనమదుర్రు డ్రెయిన్‌కు నీటి ప్రవాహం పెరగడంతో ముంపునకు గురై ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇబ్బందుల్లో ఉన్నవారికి దాతలందిస్తున్న సహాయం అభినందనీయమన్నారు. నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ వీఎస్‌కే కళాశాల వ్యవస్థాపకులు వబిలిశెట్టి పట్టబిరామయ్య, వబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు ఆర్థిక సహకారంతో 200 మందికి బియ్యం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో కొండ్రు శ్రీనివాస్, అనగాని కృష్ణప్రసాద్, గొర్రెల గోపి, బి చిన్నా, ఉండ్రు సత్యనారాయణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనతో ఉండాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి జియావుద్దీన్

పాలకొల్లు సెంట్రల్: ప్రతి పౌరుడూ చట్టాలపై అవగాహన కలిగిఉండాలనే ఉద్దేశంతో న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేశారని పట్టణ మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ జియావుద్దీన్ షేక్ అన్నారు. శనివారం స్థానిక డీఎన్నార్ మహిళా కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జడ్జి జియావుద్దీన్ మాట్లాడుతూ చట్టాలపై అవగాహన చేసుకోవడం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, న్యాయవాదులు అనంతలక్ష్మి సత్యవతి, ప్రసాద్, పి రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెంకు పురుగులను అరికట్టాలి

యలమంచిలి: అడవిపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఆనుకుని ఉన్న ఎఫ్‌సీఐ గోడౌన్స్ నుంచి పెంకు పురుగులు రావడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని పెంకు పురుగులు అరికట్టడానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత శనివారం పంచాయతీ కార్యదర్శి ఓదూరి మాధవికి ఫిర్యాదు చేశారు. పెంకు పురుగులు కళ్లలోకి వెళ్లడమే కాకుండా అవి కుట్టడం వల్ల దద్దుర్లు వచ్చి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వంట గదిలోనికి కూడా పురుగులు వ్యాపించి ఆహారం, మంచినీళ్లలో పడడం వల్ల విద్యార్థులు మధ్యాహ్న భోజనం తినడం లేదని పేర్కొన్నారు. పంచాయతీ అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని లేదా గోడౌన్ యాజమాన్యానికి తగు సూచనలు చేసి పెంకు పురుగులను అరికట్టాలని కోరారు.

కుదేలవుతున్న సర్కారు బడులు

పెరుగుతున్న 'ప్రైవేట్' వలసలు



ట్యాబ్‌ల ద్వారా విద్యనభ్యసిస్తున్న ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు (ఫైల్)



జెడ్పీ స్కూల్‌లోని విద్యార్థులు

ఆకివీడు: సర్కారు బడుల్లో విద్యార్థుల చేరిక మళ్లీ తగ్గిపోతుంది. దీంతో ప్రభుత్వ పాఠశాలలు కుదేలవుతున్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. విద్యా ప్రమాణాలు ప్రైవేట్ పాఠశాలల్లో బాగుంటున్నాయనే యోచనలో చాలా మంది ప్రైవేట్ స్కూళ్లను ఆశ్రయిస్తున్నారు. నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో విద్యార్థుల చేరిన వారి సంఖ్య కంటే పాఠశాలల నుంచి టీసీలు తీసుకొని వెళ్లిపోయేవారి సంఖ్య అధికంగా ఉంటుంది.

విద్యా ప్రమాణాలకు ప్రాధాన్యత

తల్లిదండ్రులు ఇటీవల కాలంలో విద్యా ప్రమాణాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నారు. తమ పిల్లలు ప్రైవేట్ స్కూళ్లలో చదివితే మరింత విజ్ఞానం పెంపొందుతుందని, ప్రైవేట్ యజమాన్యం విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపుతుందని భావిస్తున్నారు. విద్యార్థులతో ఆయా తరగతులలో పాఠాల బోధనపై తగిన శ్రద్ధ కనబర్చడంతో తమ పిల్లలను ప్రైవేట్ స్కూళ్లలో వేయాల్సి వస్తుందని చెబుతున్నారు. తమ బిడ్డ ప్రైవేట్ స్కూల్‌లో చదివితే గొప్పగా ఉంటుందని గ్రామీణ ప్రాంత తల్లిదండ్రులు భావిస్తున్నారు. అందువల్ల కూలీనాలీ చేసైనా పిల్లలను మంచిగా చదివించాలనే ఉద్దేశంతో ప్రైవేటబాట పడుతున్నారు.

కొత్త ప్రభుత్వంపై నమ్మకం లేక..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు పథకంలో చాలా స్కూళ్లను ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. అయితే ఇప్పుడు ప్రభుత్వం మారడం వల్ల మళ్లీ పాత రోజుల వస్తాయోమోనని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మెరుగైన వసతులు, అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికే విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో అన్ని వసతులూ కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోవడంతో పలువురు విద్యావేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సర్కారు బడుల్లో విద్యార్థులు తగ్గిపోవడానికి కారణాలను అన్వేషించాలని కోరుతున్నారు.

నియోజకవర్గంలో పాఠశాలలు: విద్యార్థుల సంఖ్య

ఆకివీడు	52	4,430
కాళ్ల	59	4,887
ఉండి	62	3,704
పాలకోడేరు	54	4,034
మొత్తం	227	17,055

అదనపు కట్నం వేధింపులపై కేసు

భీమవరం: అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడంటూ ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు భీమవరం టుటౌన్ ఎస్సై జీజే ప్రసాద్ శనివారం చెప్పారు. ఈ కేసుకు సంబంధించిన వివరాల ప్రకారం భీమవరం రూరల్ మండలం రాయలం గ్రామానికి చెందిన పట్టపు లక్ష్మీప్రసన్నకు గంగాప్రసాద్‌తో వివాహమైంది. అదనపు కట్నం కోసం గంగాప్రసాద్ వేధించడంతో ఆమె శనివారం పోలీసులను ఆశ్రయించింది.

పెద్దిరాజుకు డాక్టరేట్ ప్రదానం

ఆకివీడు: మండలంలోని దుంపగడప గ్రామంలోని ఆంధ్ర కేసరి ప్రకాశం శత జయంతి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గ్రంథాలయ శాస్త్ర అధ్యాపకులుగా పని చేస్తున్న ఆవాల పెద్దిరాజుకు అన్నామలై విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల అధ్యాపకులు ఆయనను అభినందించారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



పీఎస్ఎమ్ స్కూలు ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం



కోపల్లె హై స్కూల్లో మొక్కలు నాటుతున్న దృశ్యం

కాళ్ల: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థి, యువత పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీ కృష్ణంరాజు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా శనివారం కాళ్ల మండలం కోపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మొక్కలు నాటించే కార్యక్రమాన్ని చేపట్టారు. కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్, ఐక్య నేషనల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణమరాజు మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం ప్రకృతి, వాతావరణం, జీవ వైవిధ్యం ప్రాముఖ్యతను గుర్తు చేస్తుందన్నారు. హైస్కూల్ ప్రాంగణంలో విద్యార్థులు సుమారు 30 మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి జి.కనకరాజు, వై.శ్రీనివాసచారి, జి.స్వామినాయుడు, విద్యార్థులు అంజనాదేవి, పూర్ణచంద్ర, హర్షిత, శ్రీవల్లి, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిక్షణకు మొక్కలు పెంచాలి

భీమవరం: శిక్షా సప్తాహ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పొట్టిశ్రీరాములు మునిసిపల్ (పీఎస్ఎమ్) గరల్స్ హైస్కూలు ఆవరణలో అధికారులు మొక్కలు నాటి విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సమగ్ర శిక్ష అభియాన్ అడిషినల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్, ఏఎంఓ రామకోటేశ్వరరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలను పెంచాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు.

అత్యాచారం కేసుల్లో దోషులను కఠినంగా శిక్షించాలి



భీమవరంలో శ్రామిక మహిళా సమన్వయ కమిటీ, ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: ఏలూరు, ఉండిలో చిన్నారులుపై అత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ, ఐద్వా డిమాండ్ చేశాయి. భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్లో శనివారం నిర్వహించిన ధర్నాలో శ్రామిక మహిళా, ఐద్వా నాయకురాండ్రు డి కళ్యాణి, సరోజిని మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చిన్నారులు, మహిళలపై అత్యాచారాలు రోజురోజుకీ పెరుగుతున్నాయని వాటిని అరికట్టే విధంగా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అత్యాచారం చేసిన దోషులను కఠినంగా శిక్షించేందుకు చట్టాలు మరింత కఠిన తరం చేయాలన్నారు. అత్యాచారాలకు ప్రధాన కారణమైన మత్తు పదార్థాలు, విచ్చలవిడిగా మద్యం విక్రయాలు అశ్లీల సాహిత్యాన్ని అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాళ్లు డి.జ్యోతిలక్ష్మి, లారెన్స్ కుమారి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దళితుల సంక్షేమానికి నిధులేవి?



భీమవరం కేవీపీఎస్ సమావేశంలో మాట్లాడుతున్న రాజగోపాల్

భీమవరం: ప్రభుత్వ పెద్దల మాటల్లో ఉన్న దళిత సంక్షేమం బడ్జెట్లో లేదని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ విమర్శించారు. భీమవరంలో శనివారం బత్తుల విజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో దళిత సంక్షేమంపై సరైన నిధులు కేటాయించలేదని పోరాడి సాధించుకున్న సబ్‌ప్లాన్ ప్రకారం జనాభా ప్రాతిపదికన దళిత పేటల అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ కేవీపీఎస్ రాష్ట్ర స్థాయి సామాజిక చైతన్య శిక్షణా తరగతులు ఆగస్టు 12,13,14వ తేదీల్లో భీమవరం అంబేడ్కర్ భవనంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు కింతాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్‌తోనే శాశ్వత పరిష్కారం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సూర్యనారాయణరాజు

భీమవరం: తలసేమియా బాధితులకు శాశ్వత పరిష్కారం బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, అటువంటి బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయడానికి హెచ్ ఎల్ ఏ పరీక్షలు తప్పనిసరని ఏఎస్ఎన్ రాజు ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ అల్లూరి సూర్యనారాయణరాజు అన్నారు. శనివారం టౌన్ రైల్వే స్టేషన్ రోడ్‌లోని ఏఎస్ రాజు ఛారిటబుల్ ట్రస్ట్, ధాత్రి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో హెచ్ఎల్ఏ పరీక్షలును చేశారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరాజు మాట్లాడుతూ తలసేమియాతో బాధపడుతున్న పిల్లల కోసం ఉచితంగా హెచ్ఎల్ఏ పరీక్షలు నిర్వహించగా 30 మంది పిల్లలకు, వారి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు విలువ హెచ్ఎల్ఏ పరీక్షలు ఉచితంగా నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ బి.భానునాయక్, పిల్లల వైద్య నిపుణుడు జి.రామకృష్ణంరాజు, ఏఎస్ఎన్ బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, ధాత్రి ఫౌండేషన్ సమన్వయకర్త రవీంద్రనాథ్, సప్త ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శరత్‌బాబు, ఏఎస్ఎన్ రాజు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు చందన, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తోటి విద్యార్థులపై సత్ప్రవర్తనతో ఉండాలి



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి అప్పలస్వామి

భీమవరం: విద్యాసంస్థల్లో తోటి విద్యార్థుల పట్ల సత్ప్రవర్తన కలిగి ఉండాలని ర్యాగింగ్ పేరిట మానసికంగా శారీరకంగా హింసించడం నేరమని భీమవరం సివిల్ జడ్జి బి.అప్పలస్వామి అన్నారు. మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో ర్యాగింగ్, మాదక ద్రవ్యాల నిరోధక చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మంచి వ్యక్తులతో స్నేహం చేస్తే మంచి అలవాట్లు అలవడతాయన్నారు. ర్యాగింగ్, మాదక ద్రవ్యాలు కేసులో పట్టుబడి నేరం రుజువైతే శిక్షలు తీవ్రంగా ఉంటాయని జడ్జి హెచ్చరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం.అంజన్‌కుమార్, కళాశాల అసిస్టెంట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామరాజు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎ.ప్రసన్న కుమార్, జాయింట్ సెక్రటరీ జవ్వాది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి



పశు వైద్య శిబిరం ప్రారంభిస్తున్న పశుగణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ డాక్టర్ జేసురత్నం

పాలకోడేరు: పశువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని పశు గణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ డాక్టర్ జేసురత్నం రైతులకు సూచించారు. శనివారం వేండ్రలో పశువులకు గర్భకోశ చికిత్సా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 69 పశువుల గర్భకోశ వ్యాధులకు చికిత్స, 30 దూడలకు నట్టల నివారణ మందులు, 60 పశువులకు గొంతు వాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు. 50 కిలోల చొప్పున పశు గ్రాస విత్తనాలను సబ్సిడీపై అందించారు. కోళ్లకు జబ్బులు రాకుండా మందులు పంపిణీ చేశారు. పశు గణాభివద్ధి సంస్థ, పశు సంవర్ధక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ సహకారంతో ఈ పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ కడలి నాగేశ్వరి, ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు టి.శ్రీదేవి, మండల పశువైద్యాధికారిని డాక్టర్ హేమ, భీమవరం మండల పశువైద్యాధికారి డాక్టర్ మౌర్య సత్యేంద్ర, జయలక్ష్మి, మేరీ కమల, పాండురంగారావు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయానికి భూమి ఇవ్వడం అభినందనీయం



రిజిస్ట్రేషన్ పత్రాలను కార్యదర్శి సత్యకుమార్‌కు అందజేస్తున్న దృశ్యం

భీమవరం అర్బన్: సచివాలయానికి ఉచితంగా 10 సెంట్లు భూమిని రిజిస్ట్రేషన్ చేయించి అభినందనీయమని సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి అన్నారు. భీమవరం మండలంలోని యనమదుర్రు గ్రామంలోని సచివాలయంలో ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్ సచివాలయ స్థలానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలను పంచాయతీ కార్యదర్శి సత్యకుమార్‌కు సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్ చేసిన కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మండల కో–ఆప్షన్ సభ్యుడు బద్ధా శాంతారామ్, గ్రామ పెద్దలు ఉన్నారు.

బాలికలపై అత్యాచారాలను అరికట్టాలి



ఐద్వా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం: బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ డిమాండ్ చేశారు. ఆకివీడులో ఏడేళ్ల బాలికపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడిన ఘటనపై శనివారం ఐద్వా ఆధ్వర్యంలో రుస్తుంబాధలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ గత రెండు నెలల కాలంలో సుమారు 55 మంది బాలికలపై అత్యాచారాలు జరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడంలేదని విమర్శించారు. మహిళ హోమ్‌మంత్రిగా ఉన్న రాష్ట్రంలో ఇలాంటి ఘనటలు జరగడం దారుణమన్నారు. కార్యక్రమంలో సుధ, జ్యోతిక, గిరిజ, రూప తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న వరద



సిద్ధాంతంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

పెనుగొండ: తగ్గు ముఖం పట్టిన వశిష్టా గోదావరి ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో మళ్లీనీటి మట్టం పెరుగుతుంది. సిద్ధాంతం కేదారీఘాట్ వద్ద మరోసారి నీటి మట్టం నెమ్మదిగా పెరుగుతుంది. ఉధృతి తగ్గి గోదావరి తగ్గుతుండడంతో పరివాహక ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకొన్నారు. తగ్గుముఖం పట్టి 24 గంటలు కాకముందే తిరిగి పెరుగుతుండడంతో హడలిపోతున్నారు. ఎగువ ప్రాంతంలో వేగంగా నీటిమట్టం పెరుగుతుండడంతో ఈసారి లంక గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళనలో ఉన్నారు. ఇప్పుడు వచ్చిన వరద కేవలం పంట పొలాలలను మాత్రమే ముంచిందని, రాబోయే ఉధృతి గ్రామాల్లోకి ప్రవేశించవచ్చునని ఆందోళన చెందుతున్నారు. గతంలో ప్రభుత్వం అన్ని విధాలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి అండగా నిలిస్తే, కొత్త ప్రభుత్వం మాత్రం ఎలాంటి ఏర్పాట్లు చేయకపోవడంతో వరద ఉధృతిని ఎలా తట్టుకోవాలో అని భయాందోళనలకు గురవుతున్నారు. ఇప్పటికే పశుగ్రాసం కొరతతో పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరోసారి వరద వస్తే ప్రజలూ ఇబ్బందులు పడే అవకాశం ఉంది. దీంతో త్వరగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని లంక గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకోడేరు: ఆదివారం ఉదయం 7:30 గంటల నుంచి 12:30 వరకు విస్సాకోడేరు పైపుల చెరువు సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. కావున పంపుల చెరువు పంపు హౌస్, వేండ్ర, కొండేపూడి, విస్సాకోడేరు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కోరారు.

దివ్యాంగులకు రగ్గుల పంపిణీ

భీమవరం: వివేకానంద సేవా సమితి ఆధర్యంలో దివ్యాంగులకు శనివారం రగ్గులు, భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవా సమితి కార్యదర్శి నారాయణరాజు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి చేతనైనంత సాయం చేయాలని, సాటి మనిషి పట్ల ప్రేమ, దయ, జాలి, కరుణ కలిగి ఉంటేనే జీవితానికి అర్థం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, వివేకానంద సేవా సమితి సభ్యులు నందమూరి రాజేష్, కొండ్రు శ్రీనివాస్, ఫణి, వడ్డి సుబ్బారావు, పులపర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఆర్‌డీఎస్ కళాశాలలో నాక్ బృందం పర్యటన



భీమవరం ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వ కళాశాలకు నాక్ నివేదికను అందిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని ఆర్‌ఆర్‌డీఎస్ ప్రభుత్వడిగ్రీ కళాశాలలో సౌకర్యాలు, విద్యా బోధన పట్ల నాక్ బృందం సంతృప్తి వ్యక్తం చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ వికేజే ప్రసూన చెప్పారు. కళాశాలలోని సౌకర్యాలు, వసతులు ఎలా ఉన్నాయో? రెండు రోజులు పాటు పరిశీలించిన నాక్ బృందంలోని గుజరాత్‌లోని బరోడాకు చెందిన మహారాజా సాయాజీరావు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ప్రజ్ఞేష్ షా, కర్ణాటకలోని తుంకూర్ యూనివర్శిటీ ప్రొఫెసర్ ఎం కోట్రేష్, కేరళకు చెందిన సైంట్ జోసెఫ్ కళాశాల ప్రిన్సిపల్ జార్జి.వి. థామస్ పరిశీలించినట్లు ప్రసూన చెప్పారు. నాక్ నివేదికను అందజేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

శాకంబరిగా దుర్గమ్మ



శాకరంబరి అలంకరణలో దుర్గమ్మ

నరసాపురం రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారిని శనివారం శాకంబరిదేవిగా అలంకరించారు. తహసీల్దార్ కార్యాలయ మహిళా ఉద్యోగుల ఆధ్వర్యంలో అమ్మవారికి చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంటుంది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ



నరసాపురం రూరల్: మండలంలోని మేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. పెద్ద సంఖ్యలో భక్తుల రావడంతో ప్రధాన రహదారి మొత్తం మధ్యాహ్నం వరకూ భక్తులతో కిక్కిరిసి ఉంది. ముఖ్యంగా స్వామి వారిని అలంకరించిన తీరు భక్తులను ఆకట్టుకుంది.

భారతీయ సంస్కృతిలో సంగీతం ఓ భాగం

పెనుగొండ: భారతీయ సంస్కృతి లో సంగీతం ఓ ముఖ్యమైన భాగమని, సాధన ద్వారా మానసిక ప్రశాంతతను పొందవచ్చునని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ అన్నారు. శనివారం పెనుగొండ త్యాగరాజ గానసభలో నిర్వహించిన 40వ సంగీతోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరి ఆకట్టుకుంది. ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు నూలి అనుపమా ప్రియదర్శిని, కె.మహాలక్ష్మి పాల్గొన్నారు.